# క్రైం కథ

# క్లూ

ఆ ఇంటి వాకిట్లో ఒక యువతి శవం చాపపై వుంది. శవం చుట్టూ కూర్చున్న బంధువుల కళ్లల్లో నీళ్లు, ముఖంలో విషాద రేఖలు. ఆ యువతి తల్లి కాబోలు గుండెలవిసేలా రోదిస్తోంది.

''డేవిడ్ అంటే ఎవరు?'' జనాన్ని కలియచూస్తూ ప్రశ్నించాడు. ఇన్‌స్పెక్టర్ రవిచంద్ర.

''నేనే సార్!'' ఒక యువకుడు ముందుకొచ్చాడు. అతని అందమైన ముఖంలో విషాదం ప్రస్ఫుటమవుతోంది.

''మీరేనా జ్యోతి ఆత్మహత్య చేసుకుందని మాకు రిపోర్ట్ ఇచ్చారు.''

''అవును సార్! నేనే మీకు ఫోన్ చేశాను'' అన్నాడతను.

అంతవరకు శవం దగ్గర నిలబడి పోలీసులను ఆందోళన నిండిన కళ్లతో చూస్తున్న ఒక నడివయసు వ్యక్తి ముందుకొచ్చాడు. తనే పోలీస్ రిపోర్టు ఇచ్చానన్న డేవిడ్ వైపు ఆయన ఎర్రగా చూడడం రవిచంద్ర దృష్టిని దాటిపోలేదు. అది క్షణికమే. మరుక్షణం ఆయన కళ్లు నీటితో నిండాయి.

''ఇన్‌స్పెక్టర్ గారూ! మరి నాలుగు రోజులలో నా కూతురి పెళ్లి సార్! ఈ లోగా ఏం జరిగిందో ఏమో, నా చిట్టితల్లి ఆత్మహత్య చేసుకుంది''. బావురుమని ఏడుస్తున్న ఆయన జ్యోతి తండ్రి అని గ్రహించగలిగాడు రవిచంద్ర.

''అంత్యక్రియల ప్రయత్నం విరమించుకోండి. శవాన్ని పోస్టుమార్టం కోసం హాస్పిటల్‌కి తీసుకెళ్లాలి.''

ఆయన ముఖం పాలిపోయింది.

''మీ పేరేమిటి?''

''భాస్కర్రావు సార్!''

''ఓకే! భాస్కర్రావు గారూ! నేను జ్యోతి ఆత్మహత్య చేసుకున్న గదిని చూడాలి.''

'రండి' ఆయన ముందుకి నడిచాడు. రవిచంద్ర ఆయన్ని అనుసరించాడు.

మేడ మీద గది అది. పాత కాలపు ఇల్లయినా పరిశుభ్రంగా వుంది. మెట్లెక్కి ఇద్దరూ గదిలోకి వెళ్లారు. ఆ గదిలో కిటికీ దగ్గరగా సింగిల్ కాట్, పక్కనే మేజా బల్ల, పాతకాలపు రోజ్‌వుడ్ బీరువా తప్ప మరేమీ లేవు.

దూలానికి ఊయల కట్టుకోవడానికి అనువుగా ఇనుప కొక్కెం ఫిక్స్ చేసి వుంది.

''నాలుగు రోజులలో పెళ్లి జరగబోతుండగా, జ్యోతి ఆత్మహత్య చేసుకోవడానికి కారణం ఏమయి వుంటుందనుకుంటున్నారు? ఆమెకీ పెళ్లి ఇష్టం లేదా?''

''జ్యోతి ప్రేమించిన డేవిడ్‌తోనే ఆమె పెళ్లి జరగబోతోంది సార్. ఆమె ఎందుకు ఆత్మహత్య చేసుకుందనేది నాకు అంతుబట్టడం లేదు''. భాస్కర్రావు కళ్లల్లో మళ్లీ నీళ్లూరాయి.

''జ్యోతి ఫ్యాన్ రాడ్‌కి ఉరిపోసుకుందా?''

''కాదు సార్! ఇదుగో... ఇక్కడ ఊయల కోసం ఫిక్స్ చేసిన ఇనుపకొక్కానికి''

''అసలేం జరిగిందో వివరంగా చెప్పండి.''

''ప్రతిరోజూ తెల్లవారి లేవగానే ముందు నా బంగారు తల్లి ముఖం చూడడం నాకు అలవాటు. ఇవాళ కూడా అలాగే, జ్యోతి గదిలోకి వెళ్లాను. లోపల జ్యోతి వేలాడుతోంది. కంగారు పడి ఇంట్లో వాళ్లందరినీ పిలిచాను. జ్యోతి శరీరాన్ని కిందకు దింపగానే, అర్థమయింది ఆమె చనిపోయి చాలా సేపయిందని''. గాద్గదిక స్వరంతో చెబుతూ చేతులతో ముఖాన్ని కప్పుకుని, కుమిలిపోసాగాడు. రవిచంద్ర సానుభూతిగా చూసాడాయన వైపు. అతని దృష్టి ఆయన కుడిచేతి ఉంగరం వేలి



కున్న ఉంగరంపై పడింది. ఆ ఉంగరంలో రాయి లేదు. రాయి అతికించడానికి అనువుగా వున్న స్థానం ఖాళీగా వుంది.

★★★

పోలీస్ స్టేషన్‌లో డేవిడ్ ఇన్‌స్పెక్టర్ రవిచంద్రకెదురుగా కూర్చుని వున్నాడు.

"జ్యోతి ఆత్మహత్య నాకో మిస్టరీగా వుంది ఇన్‌స్పెక్టర్ గారూ! ఆమె తండ్రి నాతో పెళ్లికి అంగీకరించాక కూడా ఆమె ఎందుకు ఆత్మహత్య చేసుకుంది? అందుకు ప్రేరేపించిన సంఘటనలేమిటి? కనీసం ఆమె ఆత్మహత్యకి ముందు ఉత్తరం రాసినా కారణాలు తెలిసి వుండేవి. మీరు మిస్టరీని ఛేదిస్తారనే ఆమె ఆత్మహత్య విషయం తెలియగానే మీకు ఫోన్ చేశాను. భాస్కర్రావుగారు హడావుడిగా ఆమె అంత్యక్రియలకి ఏర్పాటు చేస్తున్నప్పటికీ, నాపై ఆయనకి కోపం వస్తుందని తెలిసే మీకు తెలియపరచకుండా వుండలేకపోయాను.అయినవాళ్లు ఆత్మహత్య చేసుకోవడమే బాధాకరం. పోస్ట్‌మార్టమ్ కోసం మృతదేహాన్ని ముక్కలు చెయ్యడం మరింత బాధాకరం. భాస్కర్రావుగారి బాధని నేనర్థం చేసుకోగలను". మ్లానమైన ముఖాన్ని కిందకి దించుకున్నాడు.

తల పంకించాడు రవిచంద్ర.

"అగ్రకులస్థుడైన భాస్కర్రావుగారు జ్యోతిని మీకిచ్చి పెళ్లి చెయ్యాలనుకోవడం ఆశ్చర్యమే."

"మొదట అంగీకరించలేదు సార్! జ్యోతిని మరచిపొమ్మని, సాంప్రదాయ కుటుంబంలో పుట్టి ఆచారమే ఊపిరిగా బ్రతుకుతున్న తను కూతురికి మతాంతర వివాహం చెయ్యలేనని గొడవపెట్టాడు. ఆ విషయంలో నన్ను హెచ్చరించారు కూడా..."

"ఇది జరిగి ఎన్నాళ్లయింది?"

"పదిహేను రోజులయింది."

"పదిహేనురోజుల కిందట మీ పెళ్లికి వ్యతిరేకించిన ఆయన వున్నట్టుండి మీ పెళ్లికెలా అంగీకరించారు?"

"నాతో పెళ్లి జరక్కపోతే చచ్చిపోతానని జ్యోతి బెదిరించిందట. బెదిరించడమే కాదు. మణికట్టు దగ్గర నరాలు కోసుకుంది కూడా."

"ఈజిట్? రవిచంద్ర తీవ్రంగా ఆలోచిస్తున్నాడు." తండ్రి డేవిడ్‌తో తన పెళ్లికి అంగీకరించలేదని ఆత్మహత్యాయత్నం చేసిన జ్యోతి ఆయన పెళ్లికి అంగీకరించాక కూడా ఎందుకు ఆత్మహత్య చేసుకుంది?

"సార్ జ్యోతి తాలూకూ ఫోరెన్సిక్ రిపోర్ట్స్ వచ్చాయి." సార్జెంట్ ఒక కవరు అందించాడతనికి.

కవర్ ఓపెన్ చేసి ఆసక్తిగా చదవసాగాడు. క్షణకాలం దిగ్భ్రమతో ఊపిరి పీల్చుకోడం మరిచిపోయాడు. కొన్ని క్షణాల తర్వాత తేరుకొని జ్యోతి శవానికి పోస్ట్‌మార్టమ్ చేసిన గవర్నమెంటు డాక్టరుకి ఫోన్ చేశాడు.

"ఫోరెన్సిక్ రిపోర్టు చదివాను. నేను డాక్టర్ని కాదు. కాబట్టి కొన్ని విషయాలు బోధపడలేదు. మీ రిపోర్టు ప్రకారం జ్యోతిది హత్య. ఆ విషయాన్ని ధ్రువీకరించే ఆధారాలున్నాయా?"

"ఉరి పోసుకున్నప్పుడు మెడ దగ్గర కింది దవడ దగ్గర ఉరిపోసుకున్న తాడు గాని, గుడ్డ కాని, నొక్కుకుపోయిన మచ్చలు కనపడతాయి. చనిపోయాక చాలాసేపటి తరువాత ఉరితాడుకి వేలాడదీస్తే అలాంటి మచ్చలు కనపడవు. ఉరి బిగుసుకున్న కింది భాగంలో టిష్యూ తెల్లగా కనపడుతుంది. పోస్టుమార్టమ్‌లో తద్భిన్నంగా కనపడడంతో ఆమెని ఎవరైనా గొంతు నులిమి ఆనక ఉరితాడుకి వేలాడదీసారేమో అనే అనుమానంతో మెడ దగ్గర మైక్రోఫోటోగ్రఫీ చేసాను. చేతి వేళ్ల గుర్తులు అందులో స్పష్టంగా కనిపించాయి. రెండోది ఆమె పూర్తి స్పృహలో వున్నప్పుడు గొంతు నులిమి చంపడం అంత తేలిక కాదు. ఒకవేళ అలా చంపగలిగినా ఆమె హంతకుడితో ప్రాణరక్షణ కోసం పోరాడి వుండాలి కదా! అలాంటి గాయాలు ఆమె ఒంటి మీద లేవు. ఆమెని ముందు మత్తులో ముంచి ఆపై హత్య చేసి వుండాలనే అనుమానంతో శవం రక్తాన్ని కెమికల్ ఎనాలసిస్ చేసాను. అందులో ఎక్కువ మోతాదులో మత్తుమందు కనపడింది. హంతకుడు ఇంత ప్లాన్డ్‌గా ఆమెని హత్య చేసినా ఒక ఆధారం దొరికింది. అది పోస్ట్‌మార్టమ్ కోసం శవం నుంచి బట్టలు తొలగించినప్పుడు ఆమె బ్లవుజ్‌లో దొరికింది. దాన్ని కూడా మీకు పంపాను. రిపోర్టు వున్న కవరులోనే అది కూడా వుంది." చెప్పి ఫోన్ పెట్టేశాడు డాక్టరు.

ఆయన ముఖం పాలిపోయింది. నిలువెల్లా వణికిపోతూ హిస్టీరిక్‌గా అరిచాడు. "అవును నేనే... నేనే... నా కూతురిని చంపేశాను. నేనే..." అంటూ బిగ్గరగా రోదించసాగాడు.

ఇన్‌స్పెక్టరు రవిచంద్ర జ్యోతి ఫోరెన్సిక్ రిపోర్టు వున్న కవరులో వున్న చిన్న ప్లాస్టిక్ కవరు విప్పి చూశాడు. అందులో పెద్దసైజు ముత్యం వుంది. అలాంటి ముత్యాలను ఉంగరంలో మాత్రమే పొదుగుతారు.

"మైగాడ్!" అన్నాడు అప్రయత్నంగా.

"జ్యోతిది హత్యా? ఆమెని హత్య చేసేంత పగ ఎవరికి వుంది సార్?" ఆందోళనగా అడిగాడు డేవిడ్.

"భాస్కర్రావుకి" చెప్పాడు రవిచంద్ర.

★★★

"మీ అమ్మాయి పోస్టుమార్టమ్ రిపోర్ట్స్ వచ్చాయి" చెప్పాడు రవిచంద్ర.

"అలాగా!" భాస్కర్రావు అతిమామూలుగా అన్నప్పటికీ అతని ముఖంలో ఉద్విగ్నత కొట్టొచ్చినట్లు కనపడింది.

"అందరూ అనుకున్నట్లు ఆమెది ఆత్మహత్య కాదు. హత్య!"

"హత్యా?" ఆయన ముఖ వెలవెలబోయింది. "నా కూతురిని హత్య చేసేంత పగ ఎవరికి వుంది?"

ఆయన అడిగిన దానికి జవాబివ్వకుండా అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"మీ ఉంగరంలో ముత్యం ఎక్కడైనా పడిపోయిందా?" చెయ్యెత్తి ఉంగరంలో రాయి పొదగడానికి అనువుగా బోలుగా వున్న భాగాన్ని చూస్తూ అన్నాడు.

"అవును సార్! ఎక్కడో జారిపోయింది. కొత్త ముత్యం వేయించుకోవాలనుకుంటూనే, అశ్రద్ధ చేశాను."

"ఈ ముత్యం మీ ఉంగరంలోనిదే అనుకుంటాను." జేబులో నుంచి ప్లాస్టిక్ కవర్ తీసి అందులో వున్న ముత్యాన్ని రెండు వేళ్ల మధ్య పట్టుకుని అతని కళ్ల ముందుంచాడు రవిచంద్ర.

దాన్ని చూడగానే భాస్కర్రావు ముఖంలో రంగులు మారాయి.

"ఇది మీకెక్కడ దొరికింది? అయినా ఇది నాది కాదు" తడబాటుగా అన్నాడు.

"బహుశా మీరు జ్యోతి పీకపిసికి చంపేసినప్పుడో, ఆమె శవాన్ని ఉరితాడుకి వేలాడదీసినప్పుడో ఆమె దుస్తులలోకి జారిపోయి వుంటుంది." భాస్కర్రావు ముఖంలోకి నిశితంగా చూస్తూ అన్నాడు.

ఆయన ముఖం పాలిపోయింది. నిలువెల్లా వణికిపోతూ హిస్టీరిక్‌గా అరిచాడు.

"అవును నేనే... నేనే... నా కూతురిని చంపేశాను. నేనే..." అంటూ బిగ్గరగా రోదించసాగాడు.

జ్యోతిని భాస్కర్రావే హత్య చేసాడని రవిచంద్ర నిర్ధారించినప్పటికీ ఆయనే స్వయంగా అంగీకరించడంతో డేవిడ్ నిర్ఘాంతపోయాడు.

కొన్ని క్షణాల తర్వాత మామూలుగా అయి చెప్పసాగాడు భాస్కర్రావు.

"అగ్ర కులస్థుడినైన నాకు నా కూతురు మతాంతర వివాహం చేసుకోవడం ఇష్టం లేదు. ఆ విషయంలో జ్యోతిని హెచ్చరించాను. ఆమెతో చాలాసార్లు గొడవపడ్డాను. ఆమె డేవిడ్‌ని తప్ప మరెవ్వరిని పెళ్లిచేసుకోనని మొండిపట్టు పట్టింది. అటు నుంచి నరుక్కొద్దామని డేవిడ్‌ని కలుసుకొని జ్యోతిని మరిచిపొమ్మని హెచ్చరించాను. ఆ విషయం తెలిసి జ్యోతి ఆత్మహత్యాయత్నం చేసింది. డేవిడ్‌తో పెళ్లికి ఒప్పుకుంటున్నానని ఆమెని నమ్మించి ఆమెకి వైద్యం చేయించి బ్రతికించాను. డేవిడ్ కంటే అందగాడు, మంచి ఉద్యోగంలో వున్న నా మేనల్లుడితో పెళ్లి చేస్తే ఆమె క్రమేపీ డేవిడ్‌ని మరిచిపోతుందని, జీవితంతో రాజీ పడుతుందనే ఆలోచనతో జ్యోతికి నా మేనల్లుడితో రహస్యంగా పెళ్లి ఏర్పాట్లు చెయ్యసాగాను. విషయం ఎలా బయటపడిందో ఏమో... జ్యోతి డేవిడ్‌తో కలిసి ఊరొదిలి వెళ్లిపోవడానికి అన్ని ఏర్పాట్లు చేసుకుంది.

ఆమె కదలికలని ఎప్పటికప్పుడు గమనిస్తున్న నేను ఆమె ప్లాన్‌ని పసిగట్టగలిగాను. కూతురి సుఖం కంటే వంశప్రతిష్ఠే ముఖ్యమనుకున్నాను. ఆ రాత్రి ఆమెకి అనుమానం రాకుండా మత్తు మందు కలిపిన పాయసాన్ని ఆమె తినేలా చేశాను. మత్తులోకి జారుకున్న ఆమె పీకనొక్కి చంపేసి ఉరితాడుకి వేలాడదీసాను." భాస్కర్రావు వెక్కివెక్కి ఏడుస్తున్నాడు.

తను హంతకుడిగా పట్టుబడినందుకు కాదు. కన్న తండ్రయి వుండీ, కూతురిని పాశవికంగా హత్య చేసినందుకే ఆయన ఏడుస్తున్నాడని డేవిడ్‌కొక్కడికే తెలుసు.

– హోతా పద్మినీదేవి